

# వేరుకుంపటి

భానోజీరావుకి తనతల్లి రాజకీయాలూ, కుట్రలూ, రంగులు మార్చటం, ప్లేటు ఫిరాయించటం నచ్చలేదు. పోనీ తాను శ్రమించి సంపాయిస్తున్న డబ్బుని వాడుకోనిస్తుందా అంటే అదీ లేదు. యేరోజుదారోజు తన చేత బెట్టమంటుంది. తడిగుడ్డతో గొంతు బిగిస్తున్నట్టు ఫీలైనాడు భానోజీ. నోరెత్తనీయదు. రీజన్ చేయనీయదు. లాపాయింట్లెత్తుతుంది. భానోజీకి లా పాయింట్లు తెలియవు. బ్రెయిన్ వాడి, కాయకష్టం చేసి డబ్బు చేతబడగానే రిలాక్సు కావాలని ఆశ. పేకాటా, చదరంగం, సిగరెట్లు తగలేయటం చేస్తే, విశ్రాంతి వచ్చి మళ్లా పనిచేయగలుగుతారని అతని అభిప్రాయం. రోజల్లా శ్రమించి యింటికి వస్తే,

''డబ్బేదీ?'' అని నిలదీస్తుంది తల్లి.

'' ఇవాళేం రాలలేదు. ఒప్పుకున్న పని పూర్తికాలేదు. పూర్తి చేయగానే చేతబడుతుంది. నువ్వు దాన్ని గుంజేద్దువు గానివి'' అన్నాడు హాస్యానికి. తాడి ప్రమాణాన లేచింది తల్లి. చిందులు తొక్కుతూ నోటి దురుసుతనం వినిపించింది.

''మస్కా వేయలేవు. డబ్బేమో రాలింది. గాంబ్లింగ్ హౌస్‌కి వెళ్లి పందెం కాస్తే, పదిరెట్లు రాకపోగా తుడిచి పెట్టుకు పోయింది. నీ సంగతి నాకు తెలియదూ? అలా చేస్తావనే చేతులోకి డబ్బు రాగానే నాకిచ్చేయాలనే ఒప్పందం చేసుకునే, పెట్టుబడికి భూములమ్మి డబ్బు నీ చేతులో పోశాను. తగ్గ తాళం కొయ్యమేళం అని తైనాతీలు చేరతారు. తెలివి తక్కువా ఆకలెక్కువా. నీకు

కమీషన్ యిచ్చిన వాడి దగ్గరకెళ్లి నేనే తెచ్చుకుంటాను. ఇకమీదట నీదాకారాదు. యెలా చీట్లాడుతావో, సిగరెట్లు తగలేస్తావో చూస్తాను'' అని అంకెలేసింది తల్లి.

అది వంటిల్లు. తనవేపు వత్తాసు పలికేవారులేరక్కడ. మైనర్లు, వరండాలో చాపమీద నిద్రబోతున్నారు. పెద్ద అప్పలని బావగార్లు తీసికెళ్లారు. అన్నం పెట్టదని తెలిసి వీధిలోకి నడిచాడు భానోజీ ''కంట్రోల్ చేసే నాన్న పోయాడు. వుంటే కాస్తన్నా వెరిచేదేమో'' అనుకున్నాడు.

2

చేతులో డబ్బు పడగానే భానోజీ కుంపటి కొన్నాడు. వీధివేపున్న చిన్న రూమ్ అద్దెకు తీసుకున్నాడు. బొగ్గులు, బియ్యము, కొళాయి అందుబాటులో వున్నాయి. నీళ్ల గిన్నె, అల్యూమినియం గిన్నె, నీరుల్లి, మెత్తని వుప్పు పొట్లం, యెండు తామరాకులు తెచ్చుకున్నాడు. అన్నం వుడికింది. నీరుల్లి సన్నసెగన కాల్చి వుప్పు చల్లి అన్నం మీద పెట్టాడు. గొల్ల గౌరమ్మ చల్ల సీసా వుంచి వెళ్లింది. కొళాయి వద్ద నీటికోసం పోరాటంలో గౌరమ్మ పక్షం భానోజీ. బిందె నీళ్లెత్తి తల మీదుంచి, ఆమె యింట్లో గాబులో పోసి వచ్చే లోపల బిందె నింపి తలకెత్తుతాడు. ఖాళీ బిందె కొళాయి కింద వుంటుంది. అలా మిత్రులేర్పడ్డారు. నీళ్లు వేస్టుకాకుండా, కొళాయి వదిలినప్పటినించీ కట్టేసేవరకు చేసిన సేవ సత్ఫలితాలిచ్చింది. కూరలు తెచ్చిస్తే ''వండి తేవాలి. తాలింపు సామాను బాణలీ లేవు.'' అన్నాడు.

''పనికొస్తుందీ?'' అని దీర్ఘం తీసింది గౌరమ్మ.

''పోనీతేవోకు'' అని చెయ్యి తిప్పేశాడు. గౌరమ్మ తల తాటించి, మూతి తిప్పి, బెండకాయలు, తెల్లవంకాయలు తెచ్చి యిచ్చింది. వుల్లి కాల్చే అవసరం

లేదు. బెండ, వంగ కాల్చి వుప్పు చల్లి అన్నంతో తినేశాడు. అరిటి పళ్లు, జామ, సీతాఫల్, సీమరేగు, బొప్పాయి, గంగరేగు, టొమేటో రాసాగినై. కడుపునిండి, తెల్లబడి, కండబట్టింది భానోజికి. స్టూడెంట్సు స్నేహితులూ యేర్పడ్డారు. ట్యూషన్ కోసం వచ్చినట్లు భ్రమ కల్పిస్తూ పేకాటా, చదరంగం, సిగరెట్లూ అమరినై.

ఓ రోజున, రెండో జత షర్టూ, ధోవతీ కొని, ప్యాకెట్ చంకన పెట్టుకొని, అంగడి మెట్లు దిగుతుంటే తమ్ముడు కంటబడ్డాడు. నవ్వుతూ పలకరించాడు.

''వేరు కుంపటి పెట్టుకున్నావా? శివా?''

''లేదు. ఇక్కడ చిన్న జాబ్, టికెట్టు అమ్మే పని, వస్తే వచ్చాను. అమ్మా వస్తూ పోతూ వుంటుంది''.

''అందులో యెందుకు చేరావూ? బిజినెస్ వుండగా! అమ్మకు స్వంత వ్యాపారమున్నదే?'' సందేహ నివృత్తి కోసం అడిగాడు.

''నువ్వు హిమాలయా ట్రెక్కింగ్ టీమ్‌తో కలిసివెళ్లి పోయావన్నది. నాకు బిజినెస్ నడపటం రాలేదు. పై వాళ్లని యెంగేజ్ చేసింది. నష్టమెదురైంది. చివరికి వేలంబడింది. ఆర్డర్లిచ్చిన వాళ్లు, సరుకు అప్పగించలేదన్నారు. అద్దె బకాయి పడిందని ఓనరు తాళం బిగించాడు''.

''యే రోజు దారోజు లాగుతూ నిర్వహించుకొస్తుందే! లా పాయింట్స్ తెలుసు. ఆ బిజినెస్ మైనర్లకు చెందాల్సిన ఆస్తి అమ్మి పెట్టారు గనక, వారికి భాగమున్నది. వేలం వేయ వీలులేదు అని వేలం ఆపేయలేదూ? అన్న లాయరేగా?''

''యేమో వివరాలు నాకు తెలియవు. అమ్మ ప్రకాశం జిల్లా వెళ్లింది. బావ వైరిచ్చాడు. అక్కకి డెలివరీ సవ్యంగా జరగదేమోనని భయంగా వున్నదట. అమ్మ వచ్చేప్పటికి వేలం పూర్తయి తాళం కంటబడింది. కజిన్ ఓడిపోతావు డబ్బు లేకుండా గెలుస్తావా? కొట్లో విలువైనవి అమ్మి డబ్బు పట్టుకుని హిమాలయాలవేపు వెళ్లాడు భానోజీ. మైనర్ల భాగం గూడా అమ్మివాడి చేతులో యెందుకు పోశావు? వేరు కుంపటి పెట్టుకున్నాడేమో ఐపులేడు'' అని కజిన్ కూకలేసి పంపేస్తే యేడుస్తూ వచ్చింది. కోమటి గుమస్తా పనీ చేయలేకపోయాను. సేల్సు బోయ్‌గానూ పనికిరాలేదు నేను''.

తమ్ముడు యెక్కడుంటున్నదీ తెలుసుకుని తనగదికి వచ్చేశాడు భానోజీ. గది తలుపులు తీసివున్నాయి. గదిలో కుంపటి తప్పితే యేమీ లేవు. రూమ్ యజమానురాలు వచ్చి, కళ్లూ కొప్పూ, తలా చేతులూ తిప్పుతూ చెప్పింది.

''నువ్వుంటే బాగుండేదేమో భానూ! నువ్వు లేవని తెలిసేనేమో పోలీసులు రెయిడ్ చేశారు. గాంబ్లింగ్ హౌస్ నడుపుతున్నారనీ డబ్బు పెట్టి జూదమూ పేకాట ఆడుతున్నారనీ, వారంటు తీసి చూపారు. ఇద్దరు వుడాయిస్తే, ముగ్గుర్ని పట్టగలిగారు. నువ్వు చిల్లర అప్పులు చేశావట. వారు వచ్చి అన్నీ వూడ్చుకు పోయారు. చెవులు లేవనేమో కుంపటి వదిలేశారు. నాకు మూడునెలల అద్దె బకాయి పడ్డావు. కొట్టేస్తాలే. కుంపటి తీసికెళ్లు. పప్పు రుబ్బే మెషీను పెట్టుకుంటామని బయానా యిచ్చి వెళ్లారు. కొత్తగా అద్దెకొచ్చేవారు గది కడిగివుంచమన్నారు.'' అన్నది. బకెట్ నీళ్లూ, చీపిరీ రెడీగా వున్నాయి.

భానోజీ నవ్వుతూ వెళ్లి కుంపటి అందుకుని రోడ్డెక్కాడు.

యేదో తమ్ముడికి అండదండగా వుండి స్వంత బిజినెస్ నడుపుకుందాం

యెవరికిందా పనిచేయక్కర్లేదని భరోసాతోవుంటే, తాను మరో వూళ్లో బ్రాంచీ ఓపెన్ చేసి మనిషిని పెట్టి వచ్చేప్పటికి, తల్లి రానూ వచ్చింది. తమ్ముడిని తీసికెళ్లి తిరుపతిలో పెళ్లి కానిచ్చి తెచ్చి దింపి వెళ్లింది.

''వాళ్లెవరో విచారించకుండా, ప్రవర తెలుసుకోకుండా పెళ్లి చేశావేం? ప్రమాదం గాదూ! అదీ నేను లేనప్పుడే చేశావేం?'' అనడిగాడు నవ్వుతూ.

''నువ్వు చేరావుగా. వాడినో కంట కనిబెట్టి వుంటావు. ప్రవరా? మనది బాగున్నదీ! బడుద్ధాయనమోనమః అని కూచుని తినటమే మన వంశాచారం. నువ్వుంటే వాడిని పెడదోవనపట్టిస్తావు. నువ్వు చేసుకోవు వాడిని చేసుకోనివ్వవు'' అని యీసడించి కొట్టింది.

''కట్నమెంత?''

''యెంతో కొంత. విడిగా యిల్లు అమ్మకానికి సిద్ధంగా వుంటే కొని కోడలి పేర పెట్టాను. వేలం పడకుండా వుండే పద్ధతిదేనని లాయరు చెప్పాడు'' చల్లగా అంటించి వెళ్లిపోయింది. మరదలు జాణ అని తెలిసిపోయింది. వేరుకుంపటి పెట్టాలేమో. మరదలుకి చేతివాటం బాగా వున్నది. తాను లేనప్పుడు తన బిజినెస్ రన్ చేస్తు డబ్బు చేసుకుంటున్నది గూడాను. తమ్ముడేమో దాని యింటి అద్దెకూడా వసూలు చేయలేడు.

''డెకాయిట్కుకి అద్దెకిచ్చింది. నాకు భయం. దాన్నే వసూలు చేసుకోమన్నాను'' అన్నాడు తమ్ముడు.

అద్దె వసూలు చేసి తెచ్చి మరదలు చేతులో పోస్తే థాంక్స్ లేకపోగా అనుమానంగా చూస్తూ, '' ఇంకా రావాలే, బకాయి పడ్డారా? నేనే వెళ్తా'' అన్నది.

యేదో వండి పడేస్తున్నది. కుంపటి వెలిగించాలి. పుల్లిపాయ కాల్చాలి. అన్నం గిన్నెతోమాలి అని పస్తాయించాడు భానోజీ. కాని మరదలు పట్టే పాకం ముదురుపాకాన పడుతున్నది. కుంపటి తీసుకుని వెళ్లిపోయాడు భానోజీ.

3

అట్లా వేరుకుంపటితో సతమతమౌతుండగా, దేవుడు దయామయుడు గదూ, చల్లని వార్త అందించాడు. అక్క ప్రమాదంలో పోయింది. అక్క కూతురు సునీత, యేరాయైతేనేం పళ్లూడగొట్టుకోటానికన్నట్లు, తండ్రి మెడలు వంచి, కాళ్ల కాడికొచ్చిన బేరం కాశీ బోయినా రాదని చెప్పి, కట్నమక్కర్లేదన్నాడు, పిల్లనిస్తే చాలంటున్నాడని లాభం చూపించి, పెళ్లి చేయించుకుని వెళ్లిపోయింది.

''కాళ్లకు బలపాలు కట్టుకుని తిరుగుతూ మందులమ్మే వాడికివ్వాలా? ఇల్లున్నదన్నాడు. అంటే భూములు లేవని అండర్‌స్టుడ్. ద్వితీయం అందుకే గుంజనంటున్నాడు'' అని బావతప్పులెన్నితే కూతురు,

''యేం చేస్తారు నాన్నా? నన్ను వదిలించుకోవాలిగా, యేనాటికైనా పరాయి యింటిదాన్నే'' అని ఒప్పించిందట.

బావామైనర్లూ వండుకుతింటున్నారు. నౌకరు వంటమనిషిని కుదర్చబోతే, ''తండా తండారావీలులేదు. ఒక్కతే వచ్చి వంట చేసి వెళ్లిపోవాలంతే. మేమే పెట్టుకు తింటాము. అన్నీ అక్కడుంచుతా. నేను ఆఫీసు కెళ్లే లోపల ఆమె వెళ్లి పోవాలి. ఆది నిష్కారం మేలు. నన్ను దోచాలని చూస్తే లాభించదు. వంటకి వంక పెట్టము'' అన్నాడట.

భానోజీ నవ్వుకుంటూ కుంపటితో సహా వచ్చి యింట్లో అడుగుపెట్టాడు.

బావామైనర్లూ సంతోషించారు.

'పెళ్లాం సుశీ ముద్దుల తమ్ముడు. అక్క పిల్లల్ని పెంచుతాడు. తిన్నంత తిననీ, ఒక్క పూటేగా. పిల్లలకి చదువు సంగీతం నేర్పుతున్నాడు'' అని బావ సంతోషించాడు.

బాగానే వెళ్లినై రోజులు. నలుపు విరిగి, తెలుపు వచ్చి వర్చస్సు వచ్చి, చురుకుదనం వచ్చింది భానోజీకి.

'' ఇట్లా గాదు బావా తినేదీ. ఇదేం తిండీ? ఇల్లు చిమ్ముకుని అంట్లు తోముకోటవేమిటీ? నీకు హక్కున్నది. జవాన్లను పిలిపించు. పై పనిచేసిపెడతారు. అన్నం పడేద్దాం. సరుకులు నువ్వే తెచ్చుకుంటావు. మార్కెట్‌కెళ్లి నువే కూరలు తెస్తావు. నెయ్యి నిండుకున్నదని గుర్తు చేస్తే ''అప్పుడేనా? నెలంతా రావాలే. ఇవాళ తేదీ యిరవయ్యే'' అంటావు. పదిసార్లు చెప్తే వేరుశనగ నూనె తెచ్చావు. నాకు పడదు. ఇల్లు యిరుకు. పెద్ద ఇంట్లోకి మారుదాం. ఇంటివారు రోజూ తిడుతున్నారు. బీడీలేమో మూడేయిస్తావు. సిగరెట్టు మొహం చూసి యెన్నాళ్లైందీ? పైసా కంటబడదు. దినపత్రికకు చందామానేశావు. స్టాక్ మార్కెట్, దలాల్ స్ట్రీట్ , బులియన్, రాజకీయాలు చదవాలి. లోభీ నీ సొమ్ము లోకుల పాలు పాపీ నీ సొమ్ము పరులపాలూ అన్నారు. అక్క అందుకే వెళ్లిపోయిందేమో. కూతురేమో, ''కట్టుకున్న పెళ్లాంలాగ పాదుపు చేయాలా? అనుకుని అందినవాడిని పెళ్లాడి వెళ్లిపోయింది. కట్టుకు పోతావా?''.

దీపాలు పెట్టేవేళ గోడకు తల ఆన్చి, నిటారుగా వెల్లికిలా పడుకుని, గుండెల మీద చేతులు కలిపివుంచి, కళ్లార్పుతూ, ఒక పాదం మీద మరో పాదముంచి ఆడిస్తూ బొటనవేలు కదిలిస్తున్న భానోజీని చూశాడు బావ. మాటలు

బాగా వాడిగా వుండి గుచ్చుకున్నై.

''కట్టుకుపోను. మైనర్లవంతు ఆస్తి గూడా అమ్మి, వ్యాపారం పెట్టి వేలం పడేయించిన వాళ్లు ఎలా తినాలో, ఎలా జీవించాలో చూపిస్తున్నాను'' అన్నాడు తాపీగా.

''వ్యాపారం వేలం పడటానికి మూలమెవరో యీ లోభికి ఓనాడు తెలిసివస్తుంది'' అనుకున్నాడు భానోజీ.

4

మరునాడు యెప్పటల్లేనే తెల్లారింది. పిల్లలు నవ్వుతూ గెంతుతూ అరుస్తూ శక్తి మేరకు పనిచేసి, కాఫీ చేశారు. దోసెలు వేసారు. వంట మొదలెట్టారు.

తండ్రి కాలకృత్యాలు కానిచ్చి వచ్చి చూశాడు. ఇల్లంతా తిరిగాడు. కుంపటి కనబడలేదు.

''వేరుకుంపటి వెళ్లిపోయింది. మరీ మంచిది'' అనుకుని వచ్చి కూర్చుని కాఫీ తాగాడు. పిల్లల సాయంతో వంట పూర్తి చేశాడు.

బడివేళా ఆఫీసు వేళకి, భోజనాలు కానిచ్చి, పళ్లాలు కడిగి బోర్లించి మూతలు పెట్టి గిన్నెలు సర్దారు. యూనిఫామ్ వేసుకుని పుస్తకాల సంచీలందుకున్నారు. వాకిట్లో స్నేహితుల పిలుపుకి పరుగెత్తారు.

తండ్రి కోటందుకుని, తలపాగా పెట్టుకుని, వక్క నోట్లో పెట్టుకుని యిల్లు తాళం పెట్టి వుద్యోగ ధర్మం నిర్వర్తించటానికి బయలుదేరాడు.